క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

కొండగట్టు: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన చిర్ర అనిల్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి, రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్,సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, కొండగట్టు మాజీ డైరెక్టర్ గాజుల శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్, మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో ప్రభుత్వ విప్ పర్యటన



అంజయ్యను పరామర్శిస్తున్న విప్

మేడిపల్లి: మండలంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆదిశ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్త పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారం క్రితం గాలివానకు తాడిచెట్టుపై నుంచి పడి గాయాల పాలైన అంజయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షు రమేశ్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, చేపూరి నాగారాజు, ఉరుమట్ల లక్ష్మణ్, మాదం వినొద్, గడ్డం జలందర్ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జగిత్యాల: ప్రీస్కూల్ పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని పలు సెంటర్లలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2–5 ఏళ్లలోపు ప్రీస్కూల్ వయస్సు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, కేంద్రాల్లో బుక్స్ ఎల్‌కేజీ, యూకేజీ బుక్స్‌తో పాటు, ప్లే మెటీరియల్ సైతం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, జరీన్, అతియా పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. శుక్రవారం మండల పరిషత్‌కార్యాలయంలో బడిబాట పై హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న భోదనతో పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, ఎంపీవో కృపాకర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు విద్యార్థినుల ఎంపిక

ధర్మపురి: మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించి 6వతరగతి ప్రవేశానికి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ధర్మపురిలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో 5వతరగతి చదివిన గుండారపు శాన్విక, వంగల లలన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 100 మార్కులకు 74,73 మార్కులు సాధించి 6వ, తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. హెచ్‌ఎం రావర్తి విజయలక్ష్మి విద్యార్థినులను అభినందించారు.

పదవి ఉన్నా, లేకున్నా ప్రజా సేవలోనే..

- కోరుట్ల మండల సభలో సభ్యుల భావోద్వేగం
- సాదా సీదాగా సమావేశం



మండల సభ్యులను సన్మానించిన అధికారులు

కోరుట్ల రూరల్: 'ప్రతీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చటంలోనే ఆనందంగా గడిపాం.. ఐదేళ్ల పదవీ కాలం చూస్తుండగానే గడిచి పోయింది..రాబోయే రోజుల్లో కూడా పదవులు ఉన్నా లేకున్నా ప్రజా 'సేవలోనే కొనసాగుతాం' అని స్పష్టం చేశారు మండల సభ్యులు.. కోరుట్ల మండల సర్వ సభ్య చివరి సమావేశం ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.అధికారులు గత 6 నెలల ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు.సభ్యులు కూడా గ్రామాల్లో పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎంపీపీ తోట నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభించిన పనులు యథావిధిగా కొనసాగించి పూర్తి చేయాలని, బిల్లులపై ఎలాంటి ఆందోళన వద్దని పేర్కొన్నారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పదవీ కలం ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు ఐదేళ్ల తమ అనుభవాన్ని పంచుకున్నారు. వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామని, ఐదేళ్ల కాలంలో సభ్యులమంతా కుటుంబ సభ్యులుగా ఉన్నామని బావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సభ్యులను అధికారులు సన్మానించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో నీరజ, మండల వ్యవసాయ అధికారి నాగమణి, పలువురు ఏఈలు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శోభ

పెగడపల్లి: ఎంపీపీ శోభ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సాధారణ సమావేశం సాదాసీదాగా జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలు అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యంతో సమస్యలు పరిష్కారం కాకుండానే తమ పదవీకాలం ముగిసి పోతుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా వానాకాలం సాగు సమయంలో పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు మాత్రమే వ్యవసాయశాఖ పరిమితమైందని, పెసర్లు, కందులు, మొక్కజొన్న, వరి వంగడాలు రాయితీపై సరఫరా చేయాలని ల్యాగలమర్రి ఎంపీటీసీ అంజయ్య డిమాండ్ చేశారు. గొర్రెల యూనిట్లకు డీడీలు చెల్లించి మూడేళ్లు దాటినా లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వలేదని, గొర్రెలు ఇవ్వక పోయినా కనీసం వారి డబ్బులైన వాపస్ ఇవ్వాలని ఎల్లాపూర్ ఎంపీటీసీ రవి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంచినీటి పథకాల ట్యాంకులు శుభ్రం చేయకుండా నీటిని సరఫరా చేయడంతో నాచు, మురికి నీరు వస్తుందని ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని డీఈఈ మురళీని ఎంపీటీసీ రవి కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అటెండర్ల కొరత వేధిస్తోందని అన్ని వసతులు కల్పించాలని ఎంపీటీసీ అంజయ్య అధికారులను కోరారు. దీంతో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్ల నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నా ప్రైవేట్ స్కూల్లో పిల్లలను చేర్పిస్తున్నారని సర్కార్ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు, పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇంకుడుగుంతలు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించాలని బతికపల్లి ఎంపీటీసీ అనసూర్య కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమయ్వయంగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకున్నామని ఎంపీపీ శోభ తెలిపారు. మండలాభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎంపీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగారాణి, డీఈఈ మురళి, అశ్విన్, ఎంపీవో మహేందర్, వైద్యాధికారి రమ, ఎంఈవో శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, షంషేర్ అలీ, మధు, ఏవో విలీన, కీర్తిమా, సురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, సూపరింటెండెంట్ చక్రధర్, ఏపీవో అనిల్, ఏపీఎం సమత పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి స్కూల్ యూనిఫామ్స్ అందజేత



యూనిఫాంలు అప్పగిస్తున్న మహిళా సభ్యులు

వెల్గటూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిచే యూనిఫారమ్స్‌ను శుక్రవారం వెల్గటూర్ మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో స్వశక్తి సంఘాల ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఏపీఎం చంద్రకళ మాట్లాడుతూ వెల్గటూర్, ఎండపల్లి మండలాలపరిధి లోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి బాలికల యూనిఫార్మ్స్‌ను ఎమ్మార్సీలో అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, మండల సమాఖ్య కార్యదర్శి సుమలత, కోశాధికారి సత్యవతి, ఎమ్మార్సీ సీఆర్పీ కవిత తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మా పిల్లలకు మేమే యూనిఫాంలు కుట్టి అధికారులకు అప్పగించడం సంతోషంగా ఉందని మహిళా సంఘాలు పేర్కొన్నాయి. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెర్ప్ ఆధ్వర్యంలో కుట్టిన 714 స్కూల్‌యూనిఫాంలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో వాసం భీమయ్య, ప్రధానోపాధ్యాయులు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న 12 మందిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. సిరికొండ శివారులోని మామిడితోటలో కోరుట్లకు చెందిన పలువురు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో దాడులు చేశారు. పేకాట రాయుళ్ల వద్ద రూ.76 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

గుట్కా పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గంజ్‌చౌరస్తాలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టణ సీఐ వేణుగోపాల్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గంజ్‌చౌరస్తాలో ఉత్తమ్‌సింగ్ అనే వ్యక్తికి చెందిన కిరాణషాప్‌లో నిషేధిత గుట్కా, విమల్ ప్యాకెట్లు, సితార ప్యాకెట్లు లభించాయి. వాటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు.

వృద్ధురాలిని దూషించిన వ్యక్తులపై కేసు నమోదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో మురికికాల్వలో విషయంలో ఏర్పడ్డ గొడవలో ఓ వృద్ధురాలిని దూషించి, నెట్టివేసిన సంఘటనలో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం పర్వతి రాజవ్వ అనే వృద్ధురాలితో ఇంటి సమీపంలోని మురికికాల్వ విషయంలో అదే గ్రామానికి చెందిన బర్ల చిన్న రాజేశ్, ఆయన కుమార్తె బర్ల దీప గొడవపడి దూషించి, నెట్టివేయడంతో రాజవ్వ రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేశ్, దీపపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కోదండ రామాలయంలో కుంకుమార్చన



కుంకుమార్చనలో మాతలు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక మహిళలు సీతారామచంద్రస్వామితో పాటు, ఆంజనేయస్వామిని తామర పూలతో అందంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సుహాసినులు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ వొద్ది శ్రీలత, భారతి, వీణ, రజిత, సునీల,అంజలి తదితరులు పాల్గొన్నారు.

లలితమాత ఆలయంలో కుంకుమపూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస లలిత మాత ఆలయంలో శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు లలిత మాత ఆలయంలో 108 శ్రీచక్రాలకు కుంకుమపూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప, మహిళ భక్తులు పాల్గొన్నారు.

'కార్యకర్తల కృషితోనే కాంగ్రెస్‌కు అధిక ఓట్లు'

మెట్‌పల్లి: కార్యకర్తల కృషితోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో కంటే అధిక ఓట్లు వచ్చాయని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. పార్టీ అభ్యర్థి ఓటమిపై కార్యకర్తలు నిరాశ చెందవద్దన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. కోడ్ ముగిసినందునా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

రాయికల్: క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారి కస్తూరి సతీశ్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు క్షయవ్యాధి నివారణ టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విస్తీర్ణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ వినోద్, రాహూల్, ఝూన్సీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో నాణ్యమైన విద్య



కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో బాలికలు అడ్మిషన్లు తీసుకుని నాణ్యమైన విద్య పొందాలని ఉపాధ్యాయులు సూచించారు. శుక్రవారం సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయం ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించి కస్తూర్బాలో వచ్చిన ఫలితాలను వివరిస్తూ, కస్తూర్బాలో చేరితే ఉత్తమమైన విద్యతో పాటు, విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి వసతులు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈవో వాసం భీమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల నూతన కార్యవర్గం

ధర్మపురి: మండలంలోని వివిద గ్రామాల్లో కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ట్రస్మా ముఖ్య సలహాదారు సంగనభట్ల దినేశ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల గౌరవ అధ్యక్షుడిగా గట్ల శ్రీనివాస్, చిలువేరి శ్యాంసుందర్, అధ్యక్షుడిగా జాజాల రవీందర్, ఉపాధ్యక్షుడిగా అరికెల్ల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా చల్ల శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: పొలాస, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని లక్ష్మీపూర్, పొలాస, జాబితాపూర్, ధర్మారం, పొలాస ఎక్స్‌ప్రెస్ ఫీడర్, గుల్లపేట, అనంతారం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మండలంలోని చల్‌గల్‌న్ మోతే సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు.

జిల్లా కేంద్రంలోని టౌన్–2 పరిధిలోని కాలనీల్లో నేడు మధ్యాహ్నం 3 గంటలను నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

మల్యాల: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి, మద్దుట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈలు శ్రీనివాస్,దయానంద్ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

బుగ్గారం: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, ప్రజాసమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బాదినేని రాజమణి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ తమ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి వివరించారు. అభివృద్ధి పనుల గురించి పంచాయతీరాజ్ ఏఈ ముఖ్రం వివరిస్తుండగా, స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని జెడ్పీటీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలో కుళ్లిపోయిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయని జెడ్పీటీసీ తెలిపారు.

అధికారుల గైర్హాజరు సరికాదు

ఎంతో కీలకమైన మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవడం అలాగే వివిధ శాఖల మండల స్థాయి అధికారులు సైతం హాజరు కాలేకపోవడం ఏమాత్రం సరికాదన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఎంఈవో బత్తుల భూమయ్య నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అఫ్జల్‌మియా, సూపరింటెండెంట్ రాణి, ఏఈలు బండారి అశోక్, వివేక్, ముఖ్రం,సయ్యద్ అలీ,అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా బడిబాట ర్యాలీలు



పెగడపల్లిలో బడిబాట అవగాహన ర్యాలీలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో శుక్రవారం బడిబాటతో పాటు, డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులతో పాటు, అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ కో–ఆర్డినేటర్లు కొక్కుల రాజేశ్, కోరుట్ల మహేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి, కథలాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో బడిబాటలో భాగంగా శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సర్కారు బడిలోనే తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ బడిబాటలో భాగంగా ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం రాజన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ధర్మసాగర్‌కాలనీలో ప్రచారం నిర్వహించారు. కాలనీలో వలస వచ్చి స్థిరపడ్డ వారి పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి సర్కారు బడిలో చేర్పించాలని కోరారు.



బడిబాటలో ఎంపీడీవో రమాదేవి

ధర్మపురి: మండలంలోని దోనూర్‌లో శుక్రవారం ప్రొఫెసర్ బడిబాట ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కాశెట్టి రమేశ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను సర్కారు బడులకు రావాలని సూచించారు. అనంతరం విద్యాకమిటీ చైర్మన్ మారాజు రాజేశ్వరి, హెచ్‌ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది ప్రచారం

జగిత్యాలజోన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలంటూ ఓ న్యాయవాది ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి స్వగ్రామం జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేటలో ఇంటింటా తిరుగుతూ, చదువుకునే చిన్నారులను తప్పనిసరిగా బడులకు పంపించాలంటూ విద్యార్థుల తల్లితండ్రులను కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భూపతిపూర్‌లో పూర్వ విద్యార్థులు, గురువులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో 2011–12 సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి శుక్రవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న సమయంలో చేసిన అల్లరిని గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీపతి రాఘవులు, డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుపతి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు వేంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం అందరు కలిసి సహాపంక్తి భోజనం చేసి, తమ అనుభవాలు పంచుకున్నారు.



ఇబ్రహీంపట్నంలో పూర్వ విద్యార్థులు, గురువులు